


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### 'నీ స్నేహితుడెవరో చెప్పు'

**'నీ స్నేహితులెవరో చెప్పు... నువ్వేమిటో చెప్తా'** అన్న నానుడి ఉంది. అంటే మనం ఎవరితో కలిసి మెలిసి పెరిగామో, తిరుగుతున్నామో దాన్ని బట్టి మన గురించి అంచనా వేస్తారనమాట.

మా అన్నయ్యకీ, మా ఆయనకీ చిన్నప్పుడు ఆర్.టీ.సీ కాలనీలో ఒక గ్రూప్ ఉండేది. అందులో రమేష్ అనేవాడు ఒకడుండేవాడు. మా కాలనీలో శ్రీరామనవమి చాలా వైభవంగా చేసేవారు నవరాత్రులు. చిక్కడపల్లి నటరాజ రామకృష్ణగారి శిష్యబృందం చేత ఆంధ్రనాట్యం, తాడేపల్లిగూడెం మల్లిక్ బృందం చేత బుర్రకథ, సుబ్బారావు భాగవతార్ చేత హరికథలూ, కర్నాటక సంగీతం, రాత్రానాను రికార్డింగ్ డాన్స్‌లూ, తెరకట్టి 'లవకుశ'లాంటి సినిమాల దాక ఎడ తెరిపి లేకుండా ప్రోగ్రామ్‌లుండేవి.

చాతనైనంత బాగా దేవుడ్ని ఒక ఎలక్ట్రిక్ షాప్ వాళ్ళు డెకరేట్ చేసేవారు. రంగురంగుల బల్బులతో ఒక ఇత్తడి 'ఓం' కూడా స్టేజ్ మీద గుండ్రంగా తిరిగేట్లు పెట్టేవారు.

ఒకనాడు ఈ రమేష్ మా అన్నయ్యతో "అదేందిరా?" అని అరిచాడు. మా అన్నయ్య అటు చూసి భక్తిగా చేతులు జోడించి 'ఓం' అన్నాడు. రమేష్ కళ్ళు పత్తికాయల్లా పెట్టి అటే చూస్తున్నాడు. ఇంతలో కరెంట్ పోయింది. పందిట్లో కేకలూ, గోలా... వయసులో ఉన్న ఆడపిల్లలు, ఏం జరిగిందో కానీ 'కెవ్వు' 'కెవ్వు'మన్నారు. వాళ్ళ పక్కనున్న బామ్మలూ అమ్మమ్మలూ తిట్లు లంకించుకున్నారు. మళ్ళీ కాసేపటికి కరెంట్ వచ్చింది "తెలియగ లేరే.. నీ లీలలూ' అని ఆగిపోయిన రికార్డు మళ్ళీ మొదలయింది.

రమేష్ మోచేత్తో మా అన్నయ్యని పొడిచి "ఓం ఏదిరా?" అన్నాడు.

మా అన్నయ్య తలెత్తి చూసి 'కెవ్వు' మని "ఓం ఏదిరా?" అన్నాడు.

రమేష్ కిసుక్కున నవ్వి షర్ట్‌లో చూపించాడు. ఇత్తడి 'ఓం'ని. అలా ఆ రమేష్ 'దొంగ రమేష్' గా దిన దిన ప్రవర్ధమానమై ఎంతో ఎదిగాడు తర్వాత.

ఆర్.టీ.సీ బస్సు షెడ్‌లో ఆగి ఉంటే, బిస్తా గ్రామంలో బతికున్న దున్నపోతు చర్మం వలిచేసే మాంత్రికుడిలా, ఓ వైపు రేకు మొత్తం, అవతల నిలబడ్డ వాళ్ళకి తెలియకుండా వలిచేసేవాడు రమేష్.

అతను మా అన్నయ్యకీ, మా ఆయనకీ కూడా బాల్య స్నేహితుడు. కాలనీలో సైకిళ్ళు పోతే రమేష్‌నే అడగాలి. డ్రైనేజ్ మూతలు, ఇంటి ముందు ఏ మిరపకాయలో ఎండపెట్టుకున్న ఇత్తడి పళ్ళాలు, ఎవరింటికైనా వచ్చి వెళితే బీరువాలో డబ్బులు! ఇలాగన్నమాట.

అందుచేత 'నీ స్నేహితులెవరో చెప్పు... నువ్వేమిటో చెప్తా' అనే సామెత తప్పేమో అని నాకు అనిపిస్తూ ఉంటుంది. ఒక అన్నయ్య ఎమ్.కామ్ చదివాడు, రెండోవాడు ఎం.బి.బిఎస్. ఇంక మా ఆయన సరేసరి. ఎవరికీ రమేష్ నేర్పరితనం రాలేదు.

ఇంకోడు ఉండేవాడు మా కాలనీలో, టెన్త్ వరుసగా గజనీ మొహమ్మదులా దండయాత్రలు చేసాకా, ఒకసారి ఎందుకో పాసయ్యాడు. ఆ తరువాత కొన్నాళ్ళకి కనిపించాడు. "ఏమైపోయావురా?" అని మా అన్నయ్య అడిగితే 'ఉద్యోగం వచ్చిందిరా' అన్నాడు.

"ఏం ఉద్యోగం?" అని ఇంకో అన్నయ్య అడిగాడు.

"తాశిల్దార్" అన్నాడు. టెన్త్ పాసైతే తాసిల్దార్ అవ్వచ్చేమో అప్పట్లో వీళ్ళకి తెలీదు. వాడు ఆ రోజు సినిమాకి తీసుకెళ్ళి ఇంటర్వెల్‌లో వీళ్ళకి 'గోల్డ్‌స్పాట్' తాగించి, వాడు సిగరెట్టే కాల్చి రింగులు రింగులుగా పొగ వదిలితే 'తాసిల్దారే' అనుకున్నారు. వాడు శలవులకి వచ్చినప్పుడల్లా పెద్ద పెద్ద వాళ్ళని వాడు ఎలా గడగడలాడిస్తాడో, కారు డ్రైవర్ సరిగ్గా తోలలేదని ఎలా లెంపలు వాయించాడో చెప్పేవాడు. వీళ్ళు నోరు తెరుచుకుని వినేవారు.

ఓనాడు మా అమ్మమ్మతో మా అన్నయ్యలు "వాడు టెన్త్ క్లాసు చదివి తాశిల్దార్ అయిపోయాడు. మేమెందుకు ఇన్నేళ్ళు బండెడు పుస్తకాలు చదవాలి?" అని ఎదురు తిరిగారు. అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళి 'హేమలతా.. మన రెండోవాడు ఏం ఉద్యోగం చేస్తున్నాడూ?' అని మాటల మధ్యన అడిగింది.

"తాసిల్దార్ ఆఫీసులో అమ్మమ్మా" అందావిడ.

"ఏం ఉద్యోగం?" అని అమ్మమ్మ అడిగింది.

"ఫ్యూన్ ఉద్యోగం వేయించాడు మా అన్నయ్య. ఇక్కడ అల్లర చిల్లరగా తిరిగి పాడయిపోతున్నాడని" అందావిడ.

అదీ వాడి తాసిల్దారు గిరీ.

నాకు చిన్నప్పుడు చాలామంది స్నేహితులుండేవారు. కో ఎడ్యుకేషన్ కాబట్టి మగపిల్లలు కూడా, పెళ్ళయ్యాక ఓసారి మా ఆయనతో సుదర్శన్ టాకీస్‌లో సినిమాకి వెళ్ళాను. "ఏ.వి.రమణీ" అని వినిపించింది. తల ఎత్తి చూస్తే బుకింగ్‌లో టికెట్స్ ఇస్తూ 'సందానీ' అని మా క్లాస్‌మేట్ "బావున్నావా? పెళ్ళయిందా? ఆ ఎర్రటాయన మీ ఆయనా?" అని అడుగుతున్నాడు. ఈలోగా లైన్ ఆగిపోయి లైన్‌లో వెనుక వాళ్ళు అసహనంతో అరిచారు. లేకపోతే నా సహాధ్యాయీ ఇంకా కబుర్లు చెప్పేవాడు పాపం.

మరోసారి ఆటో ఎక్కి మా అమ్మమ్మతో పెన్షన్ ఆఫీస్‌కి చాదర్‌ఘాట్ వెళ్తున్నానా.. "నన్ను గుర్తు పట్టలేదా?' ఆటో డ్రైవర్ వెనక్కి తిరిగి నవ్వుతూ అడిగాడు.

"లేదే?" అన్నాను.

"నేనే పి.వి.రాజకుమార్‌ని. నీకు సైన్స్ నోట్స్ చూపించేవాడినిగా, నువ్వు డుమ్మా కొట్టినప్పుడు" అన్నాడు. నేను సరదాగా తెగ కబుర్లు చెప్పేసాను కానీ, మా అమ్మమ్మ చేతిమీద గిల్లి, జబ్బ మీద కందవూడి వచ్చేట్లు పట్టుకుని 'రోడ్డు చూసి నడపరా బాబూ' అని కంట్రోల్ చేసింది.

ఆ రోజు మా పి.వి.రాజకుమార్ మా దగ్గర డబ్బులు తీసుకోలేదు. ఎంతైనా క్లాస్‌మేట్‌కదా!

ఒకరోజు నా దగ్గర మిత్రుడూ, మా డైరెక్టరూ వచ్చి "'మొద్దు శీను' నాకు క్లాస్‌మేట్ తెలుసా? " అన్నాడు.

అది బేస్‌గా నేనో సినిమా కథ రాసేసుకున్నాను అర్జెంటుగా.

మన క్లాసులో మన బెంచీలోనే ముక్కు చీమిడి కారుస్తూ కూర్చునేవాడు పెద్దయ్యాక ఓ రాష్ట్రాన్నీ, రాష్ట్రపు పోలీస్ వ్యవస్థనీ ఊపేసే రౌడీ షీటర్ అవుతాడని మనం ఎవరిమైనా అనుకుంటామా?

మనం ఐస్‌ఫ్రూట్ నాకినాకి తింటుంటే "ఐస్ ఫ్రూట్‌కి ఎంగిలి లేదులే" అని ఇంకో పక్కనుండి నాకేవాడు పెద్దయ్యాక కేంద్రమంత్రి అయితే ఎంత ఆశ్చర్యంగా ఉంటుంది? టీ.వీలో కనిపించినప్పుడల్లా 'వీడే. వీడే. నా ఐస్‌పుల్ల నాకేవాడు' అంటే పెళ్ళాం 'కోతలు కొయ్యకు' అని చురచురా చూస్తుంది.

ఇంటర్‌మీడియెట్‌లో జడలో చేమంతులు పెట్టుకుని, పసుపు పరికిణీ మీద నల్ల ఓణీ వేసుకుని, గుండెల దగ్గరగా పుస్తకాలు పెట్టుకుని ప్రైవేటు కెళ్తుంటే, వెనకబడి, ప్రేమలేఖలు ఉండలుగా చుట్టి విసిరేస్తూ "నిలువవే.. నిలువవే.. నీలవేణీ' అని పాడుతూ వెనకబడేవాడు, మనం 'చదువూ సంధ్యా లేని పోరంబోకు వెధవ' అనుకునేవాడు, పెద్దయ్యాక, పెద్ద 'హీరో' అయి బోలెడు మంది ఫ్యాన్స్‌తో వెండి తెర ఏలేస్తుంటే, "వాడే. వాడే. రోజూ నా వెనకబడి నా వాలు చూపుల కోసం ప్రాధేయపడేవాడు" అని మనం పక్కింటావిడకి చెపితే నమ్ముతుందా?

"ఆ పక్కింటి దాని గొప్పలు ఏం చెప్పనొదినా?" అని ఇంకో పదిమందికి చెప్పి, కడుపు పట్టుకుని నవ్వుతూ ఉంటుంది.

ఓ పెళ్ళిలో 'చీఫ్ జస్టిస్' ఒకాయన వచ్చారు. మా పిన్ని ఆయన్ని గుర్తుపట్టి వెళ్ళి పలకరించింది. "మీది అర్ధారం కదూ. నీ పేరు వీర వెంకట శివ సుబ్రమణ్య చైనుల రంగనాధ కార్త వీరార్జున.." అంటూ మొత్తం పేరు చెప్పి, "నేనురా.. సుబ్బుల్ని. అంటే సుబ్బలక్ష్మిని" అంది.

జస్టిస్‌గారికి మొదట మతిపోయింది. గోల్డ్ కలర్ శారీలో ఒళ్ళంతా గోల్డ్ పెట్టుకున్న పెళ్ళాం, సన్నగా దగ్గి, కొద్దిగా దగ్గరగా జరిగి ఆయన జబ్బ గోకి "ఎవరు?" అంది.

**ఆయనకి మా పిన్ని "కరివెన్న వారి సత్రం వెనుక మూడో లైనులో ఉండేవాళ్ళం. మనం ఇద్దరం రామం మేష్టారు స్కూల్‌లో, రెండో బెంచీలో కూర్చునేవాళ్ళం. మీ బామ్మ నీ కోసం తరవాణీ తెచ్చేది" అని గుర్తు చేస్తే అమాంతం "సుబ్బులూ" అని అరిచి, సిల్క్ చీర పెళ్ళాన్ని పట్టించుకోకుండా, మా పిన్నిని వాటేసుకున్నంత పనిచేసాడు.**

**తరువాత ఆయన సూట్‌వైపూ, వెనుక నిలబడ్డ జవాన్ల వైపూ, నగల కొట్టులా ఉన్న అతని పెళ్ళాం వైపూ చూసి మా పిన్ని "వీడు నా దగ్గర లెక్కల పరీక్షలో కాపీ కొట్టేవాడు" అని మా బాబాయ్‌తో చెప్పింది.**

మా డాక్టర్‌గారికి నందేటి యాకోబు అనే బెస్ట్ ఫ్రెండ్ ఉండేవాడుట చిన్నప్పుడు. ఇద్దరూ పరిగె ఏరి అమ్ముకునేవారట. అలాంటి యాకోబు ఓ రోజు ఈ డాక్టర్‌గారికి సొంత ఊళ్ళో సన్మానం జరుగుతుంటే, కూరగాయల బండి తోసుకుంటూ వచ్చి "ఎవరూ? మా శ్రీనివాసుల్లా ఉన్నాడు" అని జనం లోంచి ఎగిరెగిరి చూస్తూ కనిపించాడుట. మా డాక్టర్ అతనిని చెంప మీదున్న పొడువాటి మచ్చని గుర్తుపట్టి మనిషిని పంపి దగ్గిరికి పిలిపించుకుని మాట్లాడితే పొంగిపోయి " ఎంత పెద్ద డాక్టర్‌వయ్యా అమెరికాలో.. ఇంకా నేను గుర్తున్నానా?" అని పొంగిపోయాడుట.

చిన్నప్పుడు కాదు కానీ నా ఇంటర్‌మీడియట్‌లో మా తెలుగు లెక్చెరర్ నేను మేగ్‌జైన్‌కి కథ రాస్తే, రిజెక్ట్ చెయ్యడమే కాకుండా అది క్లాసులో అందరికీ చదివి వినిపించి, ఎగతాళి చేసి "'య', కీ 'మ'కీ తేడా తెలీని వాళ్ళు కూడా కథలు రాసేస్తున్నారు" అని తను రాసిన ఆంధ్రప్రభలో 'పిల్లలు పాలు తాగకపోతే ఏం చెయ్యాలి?' అనే వ్యాసం గురించి (ఏడాదంతా అది చూపించి చెప్తూనే ఉండేది) అచ్చయిన రెండు కవితలు గురించీ తనని తను పొగుడుకుంటూ తెగ మాట్లాడింది. అలాంటావిడ ఓసారి నన్ను అమెరికాలో స్టేజ్ మీద చూసి 'రమణి లెక్చెరర్‌ని' అని చెప్పుకుని నా దగ్గరకొచ్చి ముద్దులు పెట్టుకుని తెగ మురిసిపోయింది. నవ్విన నాపచేను పండుతుంది కొన్నిసార్లు.

నిన్న నా ఫ్రెండు ఒకడు "మూడో బాబాయ్ ఎక్కడున్నాడూ? ఆరు? ఏడో బాబాయ్ అమెరికానా?" అని తన కజిన్‌తో మాట్లాడుతుంటే నేను ఆశ్చర్యంగా చూసా. అతను ఫోన్ పెట్టేసి, "మా చిన్నతాతగారికి ప్రింటిగ్ ప్రెస్ ఉండేదండీ, పదకొండు మంది కొడుకులు.. అచ్చు గుద్దినట్లు ఒకేలా పుట్టారు" అన్నాడు.

అలా చేసే పనికీ, జీవితానికీ సమన్వయం ఉంటుంది కొందరికి. **నా క్లాస్‌మేట్ శాంత సుందరి నేను ఏది రాసినా పరీక్షల్లో, వెనుక కూర్చుని అచ్చు దింపేసేది. ఇప్పుడు జిరాక్స్ షాపు నడుపుతోంది.**

**చిన్నప్పుడు మాకు తెలిసిన వాళ్ళ అబ్బాయి ఒకడు ఎంత ఖరీదైన వస్తువైనా రెండు నిమిషాల్లో నాశనం చేసేవాడు. కారు బొమ్మలవీ కొనితెస్తే వాటిని పై నుండి పడేసి పప్పు పప్పు చేసేవాడు. వాడు పెద్ద డైరెక్టరయి 'పెద్ద బడ్జెట్ సినిమాలు' తీసి 'టాటా సుమోలు' గాల్లోకి లేపుతున్నాడు. విధ్వంసక్ వాడి మారుపేరు.**

అసలు చిన్నప్పటి ఫ్రెండ్స్ మళ్ళీ పెద్దయాక ఎదురుపడితే గుర్తు పట్టడం పెద్ద ఆర్ట్. మా అమ్మ మొన్న నాతో ఓ ఫంక్షన్‌కొచ్చింది. మాటల మధ్యలో ఓ అబ్బాయి వాళ్ళది కోటిపల్లి రామచంద్రపురం అన్నాడు. మా అమ్మ వెంటనే "ఎక్కడుండేవారూ?" "దీక్షితులుగారు తెలుసా?" "డాక్టర్ గారి ఇంటిపక్కన మూడో ఇంట్లో ఉండేవాళ్ళం.. ఎర్ర మేడ" అంటూ మాటలు కలిపి "వీడు మా గంగాభవాని కొడుకే. భవాని ఎలా ఉందిరా? హైదరాబాదొస్తే నన్ను కలవమను" అంటూ సంబంధాలు కలిపేసింది.

మా పెద్దమ్మ సరదాగా "మా పాపాయి తను మా అమ్మ కడుపులో ఉండగా, మా అమ్మ మాట్లాడిన వాళ్ళని కూడా ఆనవాలు పట్టేస్తుంది" అని మా అమ్మ గురించి అనేది. అది అతిశయోక్తి అయినా, మా అమ్మ జ్ఞాపకశక్తి అమోఘం.

"వాడు నీ చిన్నప్పుడు మన ఇంటి పక్కన ఉండే పాలుపోసే ఆగమయ్య కొడుకు. ఆ అమ్మాయి మా పెళ్ళయిన కొత్తల్లో జటాభవన్‌లో జాకెట్లు కుట్టే జనాబాయి మూడో కూతురు" అని ఎగ్జిబిషన్‌లోనో, సినిమాహాల్లోనో గుర్తుపట్టేసి మాట్లాడేస్తుంది. వాళ్ళూ తెల్లబోయి, తరువాత గుర్తుపడ్తారు.

ఇంతకీ ఇదంతా ఎందుకంటే '**నీ స్నేహితులెవరో చెప్పు... నువ్వేమిటో నేను చెప్తా**' సామెత నాలాంటి వాళ్ళకి వర్తించదు.

మావారు ఓసారి ఆఫీసు నుండి వచ్చేసరికి ఓ పెద్దావిడా నేనూ మాట్లాడుకుంటున్నాం. "చిన్నప్పటి నుండీ మీ నవలలు చదువుతున్నా" అందావిడ. మా వారు తెల్లబోయారు. ఆవిడకి కనీసం అరవై ఐదు ఏళ్ళయినా ఉంటాయి. ఆ తరువాత కోడళ్ళ గురించీ, వంటల గురించీ, రాజకీయాల గురించీ అనర్ఘళంగా మాట్లాడి ఓ తప్పేడు 'ఉప్పుడు పిండి', ఓ గ్లాసుకాఫీ తాగి వెళ్ళాకా, "ఆవిడెవరు?" అని మా ఆయన అడిగారు.

"నా స్నేహితురాలు" అన్నాను.

"ఎక్కడ ఉంటారూ?" ఆశ్చర్యంగా అడిగారు.

"సాయి సదన్ వృద్ధాశ్రమంలో" అన్నాను.

"ఇలాంటి స్నేహితురాలు ఉందని నాకు తెలీదే"

"ఇందాకే.. డాక్టర్ గారి దగ్గర క్లినిక్‌లో పరిచయం"

"నీకు లిఫ్ట్ ఎక్కి దిగితే కూడా స్నేహం అవుతారు అనుకో.. కానీ వయసూ వారా కూడా చూసుకోవా?" అడిగారు.

స్నేహానికి జాతీ మతం, వయసూ వారా ఏవిటి నా మొహం?

ఓసారి మా అక్కయ్య కొడుకొకడు వచ్చి "మా ఆఫీసర్ నీకు చిన్నప్పుడు ఫ్రెండట. మీ ఇద్దరూ టెన్త్ క్లాసు కంబైన్డ్ స్టడీస్ చేసేవారట.. ఫలానా జాయింట్ కలెక్టర్" అన్నాడు.

నేను పేరు అడిగాను. ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. ఓనాడు అతను టీ.వీ.లో మాట్లాడుతుండగా నాకు ఫోన్ చేసి "పిన్నీ.. అతనే.. అతనే" అన్నాడు. చూసాను. బొద్దుగా ఉన్నాడు. జుట్టు ఓ ఎకరం పోయింది నుదుటి మీద. పెద్ద పెద్ద ఆల్చిప్పల్లాంటి కాంచనమాల కళ్ళు 'అంతే' గుర్తొచ్చేసాడు.

**వాడు నాతో కంబైన్డ్ స్టడీస్ అని వచ్చి బొద్దింకల్ని పట్టుకుని తాడు కట్టి జేబులో వేసుకుని ఆడేవాడు. ఓసారి నా కెమిస్ట్రీ టెక్స్ట్ బుక్‌లోంచి ఓ కాయితం చింపాడు. చీటీలు తయ్యారు చేస్తాడేమో అనుకున్నా.. ఉహూ! కత్తి పడవ చేసి నీళ్ళల్లో వేసాడు. ఒక్కడే పద్మాసనం వేసుకుని కూర్చుని 'దేవుడితో మాట్లాడుతున్నా' అనేవాడు. నేను వాడు లేనప్పుడు మా అమ్మతో, "అమ్మా వీడికి పిచ్చి.. మన ఇంటికి ఇక రానివ్వద్దు" అని చెప్పి వప్పించి, వెళ్ళగొట్టించా.**

**వాడిప్పుడు జాయింట్ కలెక్టర్. ఇంకా నేను జ్ఞాపకం ఉన్నానుట. ఎంత ఆశ్చర్యం. అసలు ఎందుకూ పనికి రాడీ వెధవ.. అనుకున్న వాళ్ళంతా చాలా గొప్ప గొప్ప వాళ్ళైపోయారు.**

నేను రచయిత్రినై కాస్త ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాక, ఫలానా అంకాలజిస్ట్ నా ఫ్రెండ్, ఫలనా నిర్మాత నా ఫ్రెండ్, ఫలానా ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ నా ఫ్రెండ్. ఇలా మాట్లాడుతుంటే, మా ఆయనకి ఒళ్ళు మండేదేమో మరి. ఓసారి "మా ఫ్రెండ్ ఫోటో పేపర్లో పడింది చూడు" అంటూ పేపర్ పట్టుకుని హడావిడి చేసి "శివా.. రేయ్ మన కోటిగాడి ఫోటో పేపర్లో పడింది.. మురళీ.. మనవాడి ఫోటో పేపర్లో పడింది ... నానీ మన కోటిగాడేరా.. డెక్కన్ క్రానికల్ తెప్పించు" అని ఆయాస పడిపోయారు. వంటింట్లో కూరలు తరుగుతున్న నేను ఈ హడావిడంతా ఓర కంట గమనించాను.

ఈయనగారి మిత్రుడు ఏదో ఘనకార్యం చేసాడు. ఇంక ఈయన్ని పట్టుకోలేం అనుకుని, వంటపని ఆదరాబాదరా ముగించుకొచ్చి, పేపర్ తీసి చూసాను.

కోటిగాడి ఫోటో క్రింద, కరప్షన్ చార్జెస్ మీద పట్టుకున్నట్లు రాసుంది. దీనికా ఈయన హడావిడి? అనుకుని "ఏవిటండీ? ఇదేమైనా ఘనకార్యమా? ఇంతమందికి చెప్పారు?" అన్నాను.

"పేపర్లో వాడి ఫోటో వచ్చిందని చెప్పా.. అంతే! గొప్పపని చేసాడని చెప్పానా?" అన్నారు.

అయినా ఈ దేశంలో 'కరప్షన్' వల్ల పట్టుపడ్డవాళ్ళు సిగ్గుపడాల్సిన పనిలేదు లెండి. ఏ మినిష్టర్ గతం తవ్వినా ఇలాంటి చరిత్రే. బోర విరుచుకు తిరగడం లేదూ?

**చిన్నప్పుడు మనకి బాలమిత్ర, చందమామా, బుజ్జాయిల్లాంటి పుస్తకాలలో నీతి కథలూ హరికథల్లో పిట్ట కథలు కొన్ని నీతులు నేర్పేవి. అందులో అబద్ధం, లంచం, దొంగతనం, హత్యలూ, మానభంగాలూ లాంటివి తప్పని చెప్పే కథలు. కానీ ఇప్పుడు మన పిల్లలూ తరువాతి తరాలూ చూస్తున్న సినిమాల్లో పాత్రలు ఎలా ఉంటున్నాయంటే, పొగరుబోతు అత్త.. తండ్రి అన్నా, పుట్టింటి వాళ్ళన్నా పురుగుల్లా చూస్తూంటుంది. ఆవిడ్ని మేనల్లుడు వచ్చి బుట్టలో వేసి, ఆవిడ కూతుళ్ళకి 'లైనేసి' పుట్టింటికి తీసుకెళ్తాడు. ఇందుకు పాపం తన క్రింద పని చేసేవాళ్ళ చెంపలు 'ఛెళ్ళు చెళ్ళు'మని తెగవాయిస్తాడు. ఇది ఓ ఉదాత్తమైన మేనత్త పాత్ర.**

**ఓ తాతగారు చాలా ముక్కోపీ, మూర్ఖుడూ, ఆయనకి సంసారం ఎటుపోయినా తన పంతం ముఖ్యం. తన మాట కాదని వేరే పెళ్ళి చేసుకున్నందుకు కన్న కొడుకుని చచ్చిన వాళ్ళల్లో జమ కట్టి గోడకి ఫోటో పెట్టి, బొట్టుపెట్టి, పూల దండ వేస్తాడు. ఆయన ఓ ఆదర్శవంతమైన తాతగారు.**


**తాగి, తందనాలాడ్తూ దొంగతనాలు చేస్తూ, కుటుంబ బాగోగుల కోసం పాటుపడే ఓ ఉదాత్తమైన బాబాయ్.**

**ఇంకో ఇంట్లో అన్నదమ్ములు ఇద్దరు రేసుకుక్కల్లా పోట్లాడుకుంటూనే ఉంటారు. కానీ బయటకొస్తే ఏకం అవుతారట. అన్నని 'పూజకి పనికి రాని పుష్పం' అని కూడా తమ్ముడు చెప్పేసి రక్షిస్తాడు. ఇది ఓ అన్నాదమ్ముల బంధం.**

ఈ తాతా, ఈ అత్తా, ఈ అన్నాదమ్ములు, ఈ బాబాయ్ వీళ్ళంతా ఓ ఇంట్లో ఉంటే ఊహించుకోండి?

గీతమ్మ వాకిట్లో ఈతకల్లు చెట్లే. ఇలాంటి నీతి కథలు చూస్తూ పెరిగే జెనరేషన్‌కి మా చిన్ననాటి స్నేహాలూ, తీపి జ్ఞాపకాలు వింటే ‘బోర్‘ గా ఉంటుంది. కానీ అప్పట్లో పంచుకుని తిన్న ‘కంపాస్ బాక్స్‘లో మామిడికాయ ముక్కలూ, కలిసి ఆడిన ‘దొంగాపోలీస్‘ ఆటలూ, ఇవన్నీ ఎలా మరిచిపోతాం? **మినిష్టర్ అయినా ప్యూన్ అయినా, డైరెక్టర్ అయినా డ్రైవర్ అయినా ఫ్రెండ్ ఫ్రెండేగా. వాడు మనలా కాలేడు... మనం వాడిలా కాలేము. కాబట్టి మీ స్నేహితుడెవరో చెప్పడానికి సంకోచించకండి.**




Post your comments